క్లుప్తంగా

కిటకిటలాడిన దాసాంజనేయ స్వామి దేవాలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగియటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పక్కాగా ఎన్నికల నిబంధనలు అమలు



పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నామని నార్త్ జోన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. నున్న పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు చెందిన బోర్డులను, ఫ్లెక్సీలు, స్టిక్కర్లను మంగళవారం తొలగింప చేశారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన బోర్డులు, ఇతర నాయకుల ఫొటోలు ఉన్న బోర్డులు, బ్యానర్లు ఉంచరాదని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్, ఏఎస్ఐ కృష్ణ, హెచ్‌సీ నాగరాజు 64 డివిజన్ కండ్రిక, పాయకాపురం ప్రాంతాల్లో రాజకీయ పార్టీల బోర్డులను తొలగించారు. అనంతరం నున్న గ్రామంలోనూ ఏసీపీ ప్రసాద్ పరిశీలించి రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగులు ధరింప చేయాలని ఆదేశించారు.

బీఆర్టీఎస్ రోడ్డులో నాకాబందీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల బృందంలో భాగమైన స్టాటిక్ సర్విలెన్స్ టీమ్ మంగళవారం విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో నాకాబందీ నిర్వహించారు. అధికారి ఎస్.సుకీర్తి నేతృత్వంలో స్టాటిక్ సర్విలెన్స్ టీమ్ వాహనాలను తనిఖీలు చేశారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

తుది దశకు చేరిన ఓపెన్ డ్రెయిన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దేవీనగర్ మెయిన్ రోడ్డులో ఓపెన్ డ్రెయిన్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇక్కడ ఉన్న ఓపెన్ డ్రెయిన్ కొద్ది కాలం క్రితం శిథిలమయ్యింది. దీంతో మురుగు నిలిచిపోయి దోమలకు ఆవాసకేంద్రంగా మారింది. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అధికారులతో మాట్లాడి ఓపెన్ డ్రెయిన్‌కు అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభింప చేశారు. ప్రజల కోరిక మేరకు ఓపెన్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తిచేయటంతో పాటు ప్రమాదాలు జరగకుండా ఓపెన్ డ్రెయిన్‌పై సిమెంట్ బిల్లలు వేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే వెలంపల్లిని సన్మానించిన రామకృష్ణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ నగర యువజన విభాగం అధ్యక్షుడిగా జొన్నలగడ్డ రామకృష్ణను నియమించడాన్ని హర్షిస్తూ వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సన్మానించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లిని మంగళవారం యువజన విభాగం నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఎంపికైన రామకృష్ణ మాట్లాడుతూ దేశ యువతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితం ఆదర్శనీయమని, ఆయన అడుగుజాడల్లో నేటి యువతరం అంతా నడుచుకుంటారని తెలిపారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతలను అప్పగించిన సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే శ్రీనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కర్రి రాజారత్నం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నాయకులు లంకా బాబు, పెనుమత్స సత్యనారాయణ, ఉమ్మడి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 36వ డివిజన్

- మౌలిక సదుపాయల కల్పనకు రూ.7.52 కోట్లు
- ప్రజలకు నాన్ డీబీటీ ద్వారా రూ.6.73 కోట్ల లబ్ధి
- నగదు బదిలీ పథకం ద్వారా రూ.21.82 కోట్ల లబ్ధి



సర్ విజ్జి స్విమ్మిగ్ పూల్



రైతుబజారు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 36వ డివిజన్ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గాంధీనగర్, హనుమాన్‌పేట, సీతన్నపేట, రామకోటి మైదానం, బావాజీపేట 1, 2 రెండు లైన్లు ఈ డివిజన్ పరిధిలో ఉన్నాయి. గాంధీనగర్ పూర్తిగా కమర్షియల్ ప్రాంతం. ఇక్కడ వ్యాపార, వాణిజ్య వర్గాలు అధికం. హోటల్స్, థియేటర్లు, ప్రింటింగ్ ప్రెస్‌లు, రవాణా, వస్త్ర వ్యాపారం వంటి పలు రకాల వ్యాపారాలకు కేంద్రం. హనుమాన్‌పేట హోల్‌సేల్ చెప్పుల దుకాణాలు, ప్రైవేటు ట్రావెల్స్‌కు పెట్టింది పేరు. ఈ ప్రాంతాల్లో దశాబ్దాల నాటి అవసరాలకు తగ్గట్టు డ్రెయినేజీ వ్యవస్థ, పైపులైన్లు, రోడ్లు వేశారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న పురాతన భవనాలు తొలగించి అధునాతన హోటల్స్ నిర్మిస్తున్నారు. పాత డ్రెయినేజీతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదు. ఫలితంగా వర్షాకాలం కొద్దిపాటి వర్షాలకు రోడ్లపై నీరు చేరి అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఇక సీతన్నపేట, రామకోటి మైదానం పూర్తిగా పేదలు నివసించే ప్రాంతాలు. ఇరుకు రోడ్లు, మంచినీటికి పాత పైపులైన్లు, పాత విద్యుత్ స్తంభాలతో ఆ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, డివిజన్‌లో కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా గెలవడంతో ఈ రెండు మూడేళ్ల అనూహ్యంగా మౌలిక సదుపాయాలు కల్పించారు. కోట్లాది రూపాయల నిధులతో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచారు. పాత పైపులైన్లు, యూజీడీ లైన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. రూ.7.52 కోట్ల వ్యయంతో యూజీడీ, డ్రెయిన్లు, రోడ్లు, వాటర్ పైపులైన్లు, పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రూ.36.07 కోట్లు అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఖర్చు చేసింది. అతి తక్కువ సంఖ్యలో పేదలు నివసించే గాంధీనగర్ ప్రాంతంలోనూ ఇంత స్థాయిలో పెద్ద స్థాయిలో అభివృద్ధి జరిగింది. డివిజన్ ప్రజలకు రెండు రైతు బజార్లు అందుబాటులోకి తెచ్చారు. ధర్నా చౌక్, జీఎస్ రాజు రోడ్డులో నూతనంగా రైతుబజార్లు ఏర్పాటు చేశారు.

చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్క్‌కు మోక్షం

హనుమాన్‌పేటలోని చిట్టూరి విశ్వేశ్వరయ్య పార్క్ అధ్వానంగా మారింది. గత పాలకులు ఈ పార్క్ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం షటిల్ కోర్టు, జిమ్ పరికరాలు, చుట్టు కంచెతో రక్షణ, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తున్నారు.

స్విమ్మింగ్ పూల్‌కు మహర్దశ

జింఖానా మైదానం వద్ద ఉన్న విజ్జీ స్విమ్మింగ్ పూల్ దశాబ్దాల క్రితం నిర్మించింది. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా స్విమ్మింగ్ పూల్ అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీస వసతులు లేక స్విమ్మర్లు ఇబ్బందులు పడేవారు. ఈ ప్రభుత్వం అధికారంలో స్విమ్మింగ్ పూల్‌ను ఆధునికీకరించి పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించింది. పూల్ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దారు. చక్కటి ఆర్చిని నియమించారు. డైయింగ్ సౌకర్యం కల్పించారు. రూ.1.81 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నూతన సొబగులు దిద్దుకుంది.

చక్కగా అభివృద్ధి చేశారు



రామకోటి మైదానంలో నివసిస్తున్నాం. ఇక్కడ ఎప్పటి నుంచో వీధి దీపాల సమస్య ఉంది. రోడ్లు కూడా బాగాలేదు. డ్రెయిన్ల సమస్య తీవ్రంగా ఉండేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేశారు. గతంతో పోల్చితే చక్కగా అభివృద్ధి చేశారు. కార్పొరేటర్ ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నారు.

– నాగలక్ష్మి, స్థానికురాలు

మురుగు సమస్యకు పరిష్కారం



డివిజన్‌లోని నాలుగు ప్రాంతాల్లో ముఖ్యంగా గాంధీనగర్‌లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన డ్రెయినేజీ వ్యవస్థ. అప్పటి అవసరాలకు అది సరిపోయింది. ప్రస్తుతం పెద్ద హోటల్స్ నిర్మాణం జరుగుతోంది. అందుకు తగ్గట్టుగా డ్రెయిన్లు లేవు. యూజీడీ పైపులైన్లు పాతవి. మంచి నీటి సరఫరా పైపులైన్లు కూడా ఎప్పుడో వేసినవి. వాటన్నింటిని మార్చి కొత్తవి ఏర్పాటు చేశాం. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం చేశాం. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా రెండు రైతు బజార్లు ఏర్పాటు చేశాం.

– బాలి గోవింద్, కార్పొరేటర్

ప్రత్యక్ష నగదు బదిలీ పథకం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
జగనన్న అమ్మ ఒడి	671	2,80,43,634
జగనన్న విద్యా దీవెన	339	1,26,44,831
జగనన్న వసతి దీవెన	364	63,18,625
వైఎస్సార్ రైతు భరోసా	267	1,24,53,000
వైఎస్సార్‌ఉచిత పంటల బీమా	47	6,54,767
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	57	1,68,631
రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ	32	3,24,268
వైఎస్సార్ మత్స్యకార భరోసా	141	61,55,482
వైఎస్సార్ పెన్షన్ కానుక	944	8,48 66,250
వైఎస్సార్ చేయూత	356	1,04,25,000
వైఎస్సార్ ఆసరా	856	2,64,95,217
వైఎస్సార్ సున్నావడ్డీ	1077	36,64,369
వైఎస్సార్ కాపునేస్తం	70	27,45,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	99	26,25,000
వైఎస్సార్ కళ్యాణ మస్తు	1	1,00,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	240	1,11,63,728
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	159	11,90,725
హౌసింగ్	24	22,64,968
వైఎస్సార్ బీమా	12	15,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	32	8,50,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	17	4,00,000
జగనన్న చేదోడు	38	16,33,421
కోవిడ్‌సాయం	1526	15,26,000
జగనన్న తోడు	82	26,848
మొత్తం		21,82,99,764
నాన్ డీబీటీ		
ఇంటి స్థలాలు	51	1,25,46,000
జగనన్న విద్యా కానుక	176	12,49,952
బైజూస్ కంటెంట్ ట్యాబ్స్	25	3,30,550
జగనన్న తోడు	171	31,83,849
జగనన్న గోరు ముద్ద	175	17,33,725
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	386	72,29,780
ఇంటింటికి రేషన్	1872	4,11,10,408
మొత్తం		6,73,84,284

సీఎం వైఎస్ జగన్‌పై ప్రజల్లో పూర్తి విశ్వాసం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే వెలంపల్లి



సత్యనారాయణపురంలో వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉందని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమని పశ్చిమ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తిలో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి 33వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. గత ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి, అభివృద్ధిని వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఇళ్లకు వెళితే ఎన్నడూ లేని విధంగా గత ఐదేళ్లలో సత్యనారాయణపురంలో ఎంతో అభివృద్ధి జరిగిందని సంతోషంగా చెబుతున్నారన్నారు. వారి సంతోషం చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు.

బాబు పేదలకు న్యాయం చేస్తాడా..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే కోర్టుల ద్వారా అడ్డుకున్న చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే పేదలకు మంచి చేస్తాడా అని ఎమ్మెల్యే వెలంపల్లి ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో చేసిన మంచి చూసి ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడుగుతున్నామని, 14 ఏళ్లు ముఖ్యమంత్రి చేసిన చంద్రబాబు తన పరిపాలన నచ్చితే ఓటు వేయండి అని అడిగే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సెంట్రల్ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేసిన పాపానపోలేదని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా తన పదవి కాలంలో ఆక్రమణలు, కబ్జాలు, గొడవలతోనే సరిపోయిందని విమర్శించారు. ఎలాగో తనకు ఓట్లు పడవని అర్థం చేసుకున్న బోండా ఉమా తనకు ఓటు వేయకపోతే ఊరుకునేది లేదని ప్రజలను భయందోళనకు గురిచేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి చర్యలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ కో ఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాసరావు, నాయకులు శనగవరపు శ్రీనివాస్, కొల్లూరు రామకృష్ణ, కమ్మిలి రత్నకుమార్, మైలవరపు రామకృష్ణ, రవిశంకర్, సతన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సిద్ధార్థలో ఇన్‌కెండో-2కే24



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీన్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కామర్స్ చదివే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ నెల 21వ తేదీ గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాశాల కామర్స్ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కెండో-2కే24 పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల తెలిపారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ఇన్‌కెండో-2కే24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాజేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కామర్స్ విభాగాధిపతి నారాయణరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మంగళవారం ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, యాడ్-మాడ్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ట్యాక్స్ టూ ట్రిబ్యూట్, మైండ్ ఇట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో-2024 పేరుతో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామన్నారు. కామర్స్ విభాగాధిపతి కోనా నారాయణరావు మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9 గంటల నుంచి సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి అతిథిగా ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి.సతీష్ వర్మ పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల్లో కామర్స్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతారన్నారు. పోటీల్లో విజేతలకు గురువారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు.

● 'బొండా' గిరి



దేశ వ్యాప్తంగా ఎన్నికల నియామవళి అమలులోకి రావడంతో అన్ని విభాగాల అధికారులు వారి వారి విధుల్లో నిమగ్నమయ్యారు. విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని బొండా ఉమాకు చెందిన టీడీపీ కార్యాలయంలో బ్యానర్, పోస్టర్లను తొలగించేందుకు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ కార్యాలయానికి వచ్చారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. ఇది గమనించిన నగర వాసులు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా గొడవకు దిగడంతో విస్మయం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


వీఎంసీ అధికారులను అడ్డుకున్న బీజేపీ నాయకులు

విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో భాగంగా బీజేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆ పార్టీ ఫ్లెక్సీలను తొలగించేందుకు వెళ్లిన విజయవాడ మున్సిపల్ అధికారులను బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నిబంధనల ప్రకారం ఫ్లెక్సీలను కచ్చితంగా తొలగించాల్సి ఉందని అధికారులు వివరించినా.. అధికారులతో ఆ పార్టీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గేటు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన అధికారులను అడ్డుకుని వాగ్వావాదానికి దిగారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ.13.13 లక్షలు

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని హుండీలను 73 రోజులకుగానూ లెక్కించగా రూ.13,13,870 ఆదాయం వచ్చినట్లు ఈఓ లోకేశ్వరి తెలిపారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ సి.నాగరాజు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో 'మిషన్ లెర్నింగ్ అండ్ ఐటీస్ అప్లికేషన్స్' అంశంపై మంగళవారం ఆ కళాశాల ఆవరణలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నిత్యం మార్పులు అనివార్యమవుతున్నాయన్నారు. తదనుగుణంగా విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను, సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను వివరించేందుకు సదస్సులను, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నలందలో ఉత్సాహంగా ఎగ్జిబిట్ - 2024



విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్, టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని ఎఫ్ట్రానిక్స్ సంస్థ హెచ్‌ఆర్‌డీ మేనేజర్ స్ఫూర్తి తెలిపారు. నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎగ్జిబిట్ 2024 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిట్‌కు వివిధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్ఫూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, ఆలోచనా విధానాన్ని మెరుగుపరుచుకోవడం వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా పీపీటీ, క్విజ్, మ్యాథ్స్ మోడల్, సుడోకు, ఫ్రీ ఫైర్, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ వాక్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, మ్యాథ్స్ హెచ్‌ఓడీ వి.లక్ష్మి, స్టాటిస్టిక్స్ హెచ్‌ఓడీ పి.రవికుమార్, బి.శేష పవన్. పి.అనీల తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ సంఘ్ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ్ ఏజీఎస్ ఎడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో కార్మిక చట్టాలను అణచివేస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానంతో రైల్వే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ నూతన విధానంతో పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు మాత్రమే వస్తుందన్నారు. దీంతో వారి కుటుంబం ఎలా మనుగడ సాగిస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్ పాత పెన్షన్‌ను కేంద్రం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, కొత్తగా ప్రవేశపెడుతున్న రైళ్ల కనుగుణంగా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సంఘ్ డెప్యూటీ సెక్రటరీ రాజబాబు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అల్లం రమేష్, శ్రీను, సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచ్ సెక్రటరీ సుకుమార్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రాధిక, విజయ

మధురానగర్(విజయవాడసెంట్రల్): హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు మనిషిని ఎలా రక్షించాలో ప్రతి ఒక్కరికి కనీస పరిజ్ఞానం ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి రాధిక అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. సీపీఆర్ అంటే హృదయ శ్వాస కోసం పునరుజ్జీవన చర్య అని తెలిపారు. సీపీఆర్‌ను ఎలా చేయాలో వాసవ్య మహిళ మండలి ప్రతినిధి కంకణాల విజయతో కలిసి ప్రయోగాత్మకంగా వివరించారు.

రెడ్ క్రాస్ ప్రతినిధులకు ధన్యవాదాలు

ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ.. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, దీనిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో దీని అవసరం ఎంతో ఉందని కనీస పరిజ్ఞానం తెలిసి ఉండాలని తెలిపారు. సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రాధికలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.